క్లుప్తంగా

బాధిత కుటుంబాలకు చేయూత



ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు

తిరుమలాయపాలెం: ఇటీవల మరణించిన మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన బాధిత కుటుంబాలకు పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ తరఫున ఆదివారం ఆర్థికసాయం అందజేశారు. ఈ మేరకు ఒక్కో కుటుంబానికి రూ.10 వేల చొప్పున నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఆత్మ కమిటీ చైర్మన్ చావా శివరామకృష్ణ, బీరోలు సొసైటీ చైర్మన్ రామసహాయం నరేష్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బెల్లం శ్రీనివాస్, నాయకులు కొప్పుల అశోక్, బోడ మంగీలాల్, జడల నగేష్, ఉన్నం రాజశేఖర్, తాటికొండ కిరణ్, సిరిగద్దె ఉపేందర్, లింగయ్య, గుగ్గిళ్ల అంబేడ్కర్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దూదిమెట్ల వెంకట్, రావూరి యాకూబ్‌రావు, గురవయ్య, మహేష్, నరేష్, ఉపేందర్, షేక్ జానీ, సుందరయ్య, సురేష్, వెంకన్న, కోటి తదితరులు పాల్గొన్నారు.

బోయపాటిని కలిసిన అభిమానులు



బోయపాటితో అభిమానులు

ఖమ్మంఅర్బన్: ప్రముఖ దర్శకుడు బోయపాటి శ్రీనును ఆదివారం ఖమ్మం నగరంలో బాలకృష్ణ అభిమానులు కలుసుకున్నారు. మోతుగూడెంలో 'అఖండ 2' చిత్ర షూటింగ్ షెడ్యూల్‌ను పూర్తి చేసుకున్న అనంతరం, మార్గమధ్యంలో ఖమ్మంలో ఆగిన ఆయన ఒక మెస్‌లో అభిమానులతో కలిసి భోజనం చేశారు. అనంతరం అభిమానులతో కలిసి ముచ్చటించారు. నల్లమల రంజిత్, చంద్రశేఖర్, సాయి తేజ, కృష్ణ, కిరణ్, శ్రీధర్, నరేష్, సతీష్, మురళి, మహేష్, గోపి తదితరులు ఉన్నారు.

రేపటి వరకు బ్రాండెడ్ ఎక్స్‌పో

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం నగరంలోని బైపాస్ రోడ్ చెన్నై షాపింగ్‌మాల్ పక్కన ఆర్ఆర్ఆర్ కన్వెన్షన్‌లో నిర్వహిస్తున్న బ్రాండెడ్ ఎక్స్‌పో మంగళవారంతో ముగుస్తుందని నిర్వాహకులు మంజూనాథ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్రాండెడ్ ఎక్స్‌పో ఒక కేజీ బట్టలు రూ.999లకు అందిస్తున్నామని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

పింఛన్ సౌకర్యం కల్పించాలి

ఖమ్మం సహకారనగర్: తెలంగాణలో జర్నలిస్టులకు ఇతర రాష్ట్రాల మాదిరిగానే పింఛన్ సౌకర్యం కల్పించాలని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏనుగు వెంకటేశ్వరరావు, మైసా పాపారావులు ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమిళనాడు, కేరళ, బీహార్ తదితర రాష్ట్రాలు జర్నలిస్టులకు పింఛన్ సౌకర్యాన్ని అమలు చేస్తున్నాయని తెలంగాణలోనూ అర్హత కలిగిన జర్నలిస్టులందరికీ పింఛన్ సౌకర్యం కల్పించాలని కోరారు.

నగరంలో సినిమాలు

తిరుమల	హరిహర వీరమల్లు
వినోద	హరిహర వీరమల్లు,
	ది ఫన్‌టాస్టిక్ ఫోర్
సాయిరాం	జూనియర్
ఆదిత్య	హరిహర వీరమల్లు, జూనియర్
శ్రీనివాస	హరిహర వీరమల్లు, సయార(హిందీ)

- ఖమ్మంగాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	34	బచ్చలికూర	4
వంకాయ	26		20
బెండకాయ	20	పాలకూర	3
పచ్చిమిర్చి	60		20
కాకర	30	చుక్కకూర	3
బోడ కాకర	160		20
బీర	40	తోటకూర	4
దొండ	28		20
పొట్లకాయ	40	గోంగూర	4
చిక్కుడు	66		20
గోరుచిక్కుడు	40	మెంతికూర	3
క్యాబేజీ	24		20
క్యాలీఫ్లవర్	45	కొత్తిమీర	1
ఆలుగడ్డ	22		25
చామగడ్డ	30	పుదీన	1
క్యారెట్	46		20
బీట్‌రూట్	36	-ఖమ్మం వ్యవసాయం	

మిరప.. అంతంతే..

గతేడాదితో పోల్చితే సగానికి సగం తగ్గిన మిర్చి సాగు

- గిట్టుబాటు ధర లేక అప్పుల పాలైన రైతులు
- మిర్చి సాగంటేనే హడలిపోతున్న వైనం
- నారు ఆర్డర్లు లేక దిగాలు పడుతున్న నర్సరీ నిర్వాహకులు



గతేడాది మిరప వేసిన భూమిలో ఈసారి వేసిన పత్తి

ఖమ్మంరూరల్: పాలేరు నియోజకవర్గంలోని తిరుమలాయపాలెం, కూసుమంచి, ఖమ్మంరూరల్ మండలాల్లో మిర్చి పంటకు పెట్టింది పేరు. ప్రధానంగా మిర్చికి అనుకూలమైన సారవంతమైన నల్లరేగడి నేలలతో పాటు ఎర్రచెల్క నేలలు ఉండటంతో అనుకున్న దిగుబడి రావడంతో దశాబ్దాల తరబడి మిర్చి పండిస్తూ ఆర్థికంగా ఎంతో కొంత నిలదొక్కుకున్నారు ఇక్కడి రైతులు. కొంతమంది రైతులైతే తమకున్న రెండు, లేదా మూడెకరాల్లో కేవలం మిర్చి పంటనే సాగు చేసేవారున్నారంటే మిర్చిపై ఇక్కడి రైతులకు ఎంత ఆసక్తి ఉందో అర్థం చేసుకోవచ్చు. కానీ ఈ ఏడాది మాత్రం భిన్నంగా మిర్చి సాగు గణనీయంగా తగ్గిపోయింది. తిరుమలాయపాలెం మండలంలో గతేడాది 10వేలు ఎకరాల్లో మిర్చి సాగు చేయగా 4 వేలు ఎకరాలు, ఖమ్మం రూరల్, కూసుమంచి మండలాల్లో గతేడాది 6 వేలు, 8 వేలు వేయగా ఈఏడాది 2,500, 3 వేల ఎకరాల్లో మిర్చి సాగు చేయవచ్చని అంచనా. అంటే నియోజకవర్గ వ్యాప్తంగా మిర్చి సాగు సగానిపైగా తగ్గిపోవడం గమనార్హం.

నష్టాలు, తెచ్చిన అప్పుల తీరక..

గతేడాది మిర్చి పంటకు అనుకూల వాతావరణం, తెగుళ్లు సోకడంతో దిగుబడి గణనీయంగా తగ్గి మిర్చి రైతులు భారీగా నష్టపోయారు. వచ్చిన కొద్దిపాటి పంటకు కూడా గిట్టుబాటు ధర రాకపోవడంతో కొంతమంది రైతులు పంట నిల్వలను కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేయగా, మరికొందరు రైతులు అతి తక్కువ ధరకు అమ్ముకున్నారు. ఎరువులు, పురుగు మందులకు తెచ్చిన అప్పు తీర్చడానికి, కూలీలు ఇవ్వడానికి విధిలేని పరిస్థితుల్లో పంట కల్లాల వద్దే అమ్ముకున్నారు. దీంతో గతానుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈసారి చాలామంది రైతులు మిర్చి సాగుకు దూరంగా ఉంటున్నారు. మిర్చికి ప్రత్యామ్నాయంగా పత్తి, వరి, ఇతర పంటలు ఎక్కువగా సాగవుతున్నాయి. కొద్దిమంది రైతులు మాత్రమే అంటే గతంలో నాలుగు ఎకరాలు మిర్చి వేసిన రైతులు ఇప్పుడు ఎకరం నుండి రెండెకరాలకే పరిమితమవుతున్నారు.

నర్సరీ నిర్వాహకుల దిగాలు..

మిర్చి సాగు తగ్గడంతో దాని ప్రభావం మిర్చి నర్సరీలపై పడింది. ఖమ్మంరూరల్, కూసుమంచి, తిరుమలాయపాలెం మండలాల్లో గతేడాది 19, 50, 30 నర్సరీలుండగా, ఈ ఏడాది అవి వరుసగా 12, 35, 17కు తగ్గిపోయాయి. ఇందులో కూడా గతంలో మొక్కకు 50 పైసలు తీసుకునే నిర్వాహకులు ఈసారి కొంత తగ్గించి ఇస్తామని నచ్చచెబుతున్నారని రైతులు తెలుపుతున్నారు. ఈసారి మాత్రం జూలై నెల పూర్తి కావస్తున్నా ఇంత వరకు సరైన ఆర్డర్లు రైతుల నుండి రావడంలేదని నర్సరీల నిర్వాహకులు వాపోతున్నారు. ఇప్పటి వరకు పది శాతం కూడా బుక్ కాలేదని చెబుతున్నారు.



గట్టుసింగారంలో మిర్చి నర్సరీ

ఎకరంలోనే మిర్చి సాగు..



నాకు గుర్తెరిగిన నాటి నుంచి మిర్చి కనీసం మూడు ఎకరాలకు తగ్గకుండా వేసే వాన్ని. గతేడాది మూడెకరాల్లో మిర్చి వేశా. అయితే కనీస దిగుబడి కూడా రాకపోగా రూ.2 లక్షల వరకు అప్పయింది. అప్పు ఎలా తీర్చాలో తెలియడంలేదు. నాకున్న ఆరెకరాల్లో ఈసారి అయిదు ఎకరాల్లో పత్తి వేశా. ఆశ చంపుకోలేక ఈఏడాది ఒక్క ఎకరంలో మాత్రమే మిర్చి వేయడానికి దుక్కిని సిద్ధం చేశా.

– పల్లె రమేష్, రైతు, పోచారం

ఆర్డర్లు రావట్లే..



ఈసారి మిర్చి సాగు సగానికి సగం తగ్గింది. ఆ ప్రభావం నర్సరీలపై పడి తీవ్ర నష్టం కలగనుంది. ఇప్పటికే మూడెకరాల్లో నర్సరీలో మిర్చి నార్లు పోసి పెంచుతున్నా. ఇందుకోసం లక్షల్లో ఖర్చు చేశా. తీరా ఇప్పుడు చూస్తే పరిస్థితి తారుమారయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. కనీసం నిర్వహణ ఖర్చులు కూడా వస్తాయో రావోననే ఆందోళన వెంటాడుతోంది. ఏంచేయాలో పాలుపోవడంలేదు.

–బాణోత్ కిషన్, నర్సరీ నిర్వాహకుడు, గట్టుసింగారం

సంతాన సాఫల్య కేంద్రాలపై విచారణ చేపట్టాలి



మాట్లాడుతున్న శిరోమణి

ఖమ్మంమయూరిసెంటర్: సంతానం లేని దంపతులకు పిల్లలు కలిగించే పూచి తమదని చెప్పుకొని అక్రమదందాలు చేస్తున్న సాఫల్య కేంద్రాలపై న్యాయ విచారణ జరిపించాలని పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ శిరోమణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన సంఘ జిల్లా కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ... సంతాన సాఫల్య కేంద్రాల పేరుతో అమాయకులను మోసం చేస్తున్నారని, అనుమతులేని వాటిపై అధికారులు చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. వెంటనే ఈ దందాపై న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అమాయకులను మోసం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఖమ్మంలో తనిఖీలు చేపట్టాలి..

టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్ల పేరిట ఘరానా మోసం చేసి కోట్లు సంపాదిస్తున్న దారుణం సికింద్రాబాద్‌లో వెలువడిన నేపథ్యంలో ఖమ్మంలో ఉన్న టెస్టు ట్యూబ్ బేబీ సెంటర్లపై తనిఖీలు చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆవుల అశోక్ డిమాండ్ చేశారు. పుట్టగొడుగుల్లాగా ఖమ్మంలో సంతాన సౌకర్య కేంద్రాలు ఏర్పర్చి సికింద్రాబాద్‌కు మించిన అక్రమాలు ఈ జిల్లా కేంద్రంలో జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు.

మంత్రి తుమ్మలకు వినతి



వినతిపత్రం అందజేస్తున్న పాస్టర్లు

ఖమ్మంఅర్బన్: సీఎస్ఐ సెయింట్ మేరీస్ చర్చ్ అనుబంధ సంఘాల ప్రతినిధులు ఆదివారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసి వినతిపత్రం అందించారు. నగరంలోని కొత్తగూడెం పరిధిలో కొనుగోలు చేసిన 4.20 కుంటల భూమిని సీఎస్ఐటీఏ డోర్నకల్ డయాసిస్ సంస్థ పేరుతో రెగ్యులరైజ్ చేసి, చట్టపరమైన భద్రత కల్పించాలని కోరారు. ప్రస్తుతం ఉన్న పాత సమాధుల స్థలం పూర్తిగా నిండిపోయిందని, మరణించిన వారిని పాత సమాధుల్లోనే పూడ్చిపెట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. తమ సంఘ ప్రజల అతి అవసరంగా బరియల్ గ్రౌండ్‌తో పాటు, ప్రార్థనా మందిరం, వృద్ధాశ్రమం, స్కూల్–హాస్టల్ నిర్మించేందుకు ఈ స్థలం అత్యవసరమన్నారు. పాస్టర్లు అర్వపల్లి రమేష్, బీ.శ్రీనివాస్ పాల్, చిట్టిరాజు, దొడ్డ అశోక్, పిల్లి విజయపాల్, జోసెఫ్ రామారావు, జయరాజు, మార్టిన్ జైపాల్, జాన్సన్, వెంకటరత్నం, బుడిగపాల్, పాకలపాటి వినయ్ కుమార్, సుందర్ రావు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

ఖమ్మం అర్బన్: నగరంలోని గాంధీనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1997–98వ బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అప్పటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. సంపత్‌కుమార్, సాయికృష్ణ, శ్రీను, వీరకోటి ఉన్నారు.

మంత్రి శ్రీహరికి పొంగులేటి స్వాగతం



శ్రీహరిని సన్మానిస్తున్న మంత్రి పొంగులేటి

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మంలోని తన క్యాంపు కార్యాలయానికి విచ్చేసిన తెలంగాణ పశుసంవర్ధక శాఖ మంత్రి, ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా ఉన్న వాకిటి శ్రీహరికి ఆదివారం మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఘనస్వాగతం పలికారు. కొత్తగూడెం నియోజకవర్గ పర్యటనను ముగించుకుని తిరుగు ప్రయాణంలో హైదరాబాద్ వెళ్తున్న శ్రీహరిని తన క్యాంపు కార్యాలయానికి రావాలని మంత్రి పొంగులేటి ఆహ్వానించారు. ఈ మేరకు ఆయనకు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు.

క్షతగాత్రులకు మంత్రి భరోసా..

ఖమ్మంఅర్బన్: ఆపదలోనూ నేనున్నా అని మరోమారు చాటుకున్నారు మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి. వైరారోడ్డులోని ఎస్ఆర్ గార్డెన్స్ సమీపంలో ఆదివారం సాయంత్రం కారు ఢీకొన్న ప్రమాదంలో రెండు ద్విచక్ర వాహనాలపై ప్రయాణిస్తున్న నలుగురు యువకులకు తీవ్రగాయాలయ్యాయి. ఇదే సమయంలో తన క్యాంపు కార్యాలయానికి వస్తున్న మంత్రి పొంగులేటి ఆ ఘటనను చూసి కాన్వాయ్ ఆపి గాయపడిన యువకులకు భరోసా ఇచ్చారు. ఈ మేరకు అక్కడే ఉన్న ట్రాఫిక్ సీఐ సాంబశివరావును దగ్గరకు పిలిచి క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించాలని సూచించారు. పైసా ఖర్చు లేకుండా మెరుగైన వైద్యం అందించాలని ఫోన్ ద్వారా కిమ్స్ వైద్యులను ఆదేశించారు.

అమరుల ఆశయ సాధనకు కృషి

ఖమ్మంరూరల్: పేదల సంక్షేమం, వారి సమస్యల పరిష్కారానికి అమరులు ఎన్నో త్యాగాలు చేశారని, వారి వారి ఆశయ సాధనకు కృషి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ అన్నారు. మండలంలోని కామంచికల్, దారేడులలో సీపీఐ నాయకులు హనుమంతు కృష్ణయ్య, పలువురు అమరులకు ఆదివారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కమ్యూనిస్టులు అంటేనే ప్రజల తరఫున ఉద్యమాలు చేసే వారన్నారు. భవిష్యత్‌లో ప్రజల సమస్యలపై పార్టీ ఆధ్వర్యంలో మరిన్ని పోరాటాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పుచ్చకాయల సుధాకర్, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిడకంటి చినవెంకటరెడ్డి, నాయకులు మామిండ్ల శ్రీనాథ్‌రెడ్డి, భాస్కర్, తేజావత్ కృష్ణ, వెంకటకృష్ణ, జంగాల ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రావణ బోనాల సందడి షురూ



బోనాలతో వస్తున్న మహిళలు

ఖమ్మంగాంధీచౌక్: శ్రావణమాసం బోనాల సందడి ప్రారంభమైంది. పలు ప్రాంతాల్లో అమ్మవార్లకు బోనాల చెల్లింపులును ఆదివారం నుంచి ప్రారంభించారు. నగరంలోని ముత్యాలమ్మ అమ్మవారికి నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు మేళతాళాలతో బోనాలను ఎత్తుకొని సందడి చేస్తూ సామూహికంగా వచ్చి మొక్కులు చెల్లించారు.

నేలకొండపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో బోనాల పండుగను అంగరంగ వైభవంగా నిర్వహించారు. మండలంలోని కొత్తకొత్తూరులో ముత్యాలమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలు ఎత్తుకుని భారీ ప్రదర్శన నిర్వహించారు. డప్పు వాయిద్యాలతో ఆటా, పాటలతో సందడి చేశారు. నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, మాజీ సర్పంచ్ వల్లాల రాధాకృష్ణ, నాయకులు మాదాసు శ్రీనివాసరావు, బీజేపీ మండలాధ్యక్షుడు పాగర్తి సుధాకర్, కల్యాణం నాగేశ్వరరావు, మూడు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.





నేలకొండపల్లి: బోనాలతో మహిళలు, గొర్రెలతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

ర్యాపిడ్ టెస్టులు నిర్వహించాలి

- డెంగీ కేసులతో అధికారుల్లో కదలిక



బిల్డింగ్‌పై వస్తువులను పరిశీలిస్తున్న డీటీసీఓ సుబ్బారావు తదితరులు

తిరుమలాయపాలెం: మండలంలోని చంద్రుతండాలో రెండు, అజ్మీరతండాలో మరో డెంగీ కేసు నమోదు కావడంతో అధికారుల్లో కదలిక మొదలైంది. ఆదివారం ఆయా గ్రామాల్లో సుబ్లేడు, తిరుమలాయపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల డాక్టర్ల ఆధ్వర్యంలో ఆయా గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీటీసీఓ డాక్టర్ సుబ్బారావు ఆయా గ్రామాలను పరిశీలించి ఫీవర్ సర్వే, డోర్ టు డోర్ విజిట్ కార్యాక్రమాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. అజ్మీరతండాలో మురుగునీటి గుంతలు, డ్రైయినేజీలో ఆయిల్ బాల్స్ వేయించడంతో పాటు దోమల నివారణ మందుని స్ప్రే చేయించారు. దోమల నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించాలని, జ్వర బాధితులకు డెంగీ ర్యాపిడ్ టెస్టులు నిర్వహించి వైద్యసేవలు అందించాలని వైద్యసిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎంపీఓ సూర్యానారాయణ ఆయా గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను ముమ్మరం చేయించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు వసుంధర, అవినాష్, వైద్య సిబ్బంది ఉన్నారు.

విపత్తు నిర్వహణపై ప్రత్యేక శిక్షణ



అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఖమ్మంమయూరిసెంటర్: కేఎంసీలో విధులు నిర్వహించే డీఆర్ఎఫ్ సిబ్బందికి విపత్తు నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశాల మేరకు డీఆర్ఎఫ్ సిబ్బందికి పది రోజుల పాటు విపత్తు నిర్వహణతోపాటు అత్యవసర సమయాల్లో అనుసరించాల్సి విధానాలపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని ఆదివారం లకారం ట్యాంక్‌బండ్‌పై ప్రారంభించారు. విపత్తులు సంభవించినప్పుడు సిబ్బంది తమను తాము రక్షించుకుంటూ, ప్రజలను ఎలా రక్షించాలనే అంశాలపై ప్రాథమికంగా అవగాహన కల్పించారు. బోట్‌లు నడిపే విధానం, వరదల్లో చిక్కుకున్న వారి వద్దకు చేరుకోవడం, సీపీఆర్ చేసే విధానంపై అవగాహన కల్పించారు. ఎన్‌డీఆర్ఎఫ్ బృందంతో డీఆర్ఎఫ్ సిబ్బందికి శిక్షణ ఇవ్వగా, ఉద్యాన అధికారిణి బెల్లం రాధిక పర్యవేక్షించారు.

కేటాయింపులు ఘనం.. ఖర్చు పాక్షికం



మాట్లాడుతున్న రామ్మూర్తి

ఖమ్మంమయూరిసెంటర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనులకు సంబంధించి బడ్జెట్‌లో కేటాయింపులు ఘనంగా చేస్తున్నా ఖర్చు మాత్రం చేయలేకపోతున్నారని చాలా సందర్భాల్లో గిరిజన బడ్జెట్‌ను ఇతర శాఖలకు మళ్లిస్తున్నారని తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు అజ్మీర రామ్మూర్తి నాయక్ ఆరోపించారు. తెలంగాణ గిరిజన సమాఖ్య జిల్లా ఏడో మహాసభ ఆదివారం ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో నిర్వహించారు. బోనోత్ భరత్, తేజావత్ కృష్ణ, అమరయ్య, బానోత్ జగన్, ఇర్పా సురేష్ అధ్యక్ష వర్గంగా వ్యవహరించిన మహాసభలో రామ్మూర్తి నాయక్ మాట్లాడుతూ... ఆది నుంచి గిరిజనులకు కేటాయించిన బడ్జెట్‌ను పూర్తి స్థాయిలో ఖర్చు చేయకపోవడం శోచనీయమన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన దగ్గర నుంచి గిరిజనులకు ఏదో ఒక రూపంలో అన్యాయం జరుగుతూనే ఉందన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పాలక వర్గాలు వివక్ష ప్రదర్శిస్తున్నాయన్నారు. దేవాదాయ భూములు సాగు చేసుకుంటున్న మంగాపురం గిరిజనులకు పట్టాలు ఇవ్వాలని కోరారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా సునావత్ పాండురంగా, అధ్యక్షుడిగా నాగేశ్వరరావు, కార్యదర్శిగా జగన్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బోడా వీరన్న, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా రాంబాబులు ఎన్నికయ్యారు. ఈ సభలో సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా, జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, జాగర్లమూడి రంజిత్, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మికులపై వివక్ష సరికాదు



మాట్లాడుతున్న కర్ణకుమార్

ఖమ్మం మామిళ్లగూడెం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ కార్మికులపై వివక్ష కొనసాగిస్తున్నాయని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సిద్దినేని కర్ణకుమార్ అన్నారు. నగరంలోని ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో ఆదివారం జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పెరిగిన నిత్యావసర వస్తువులతో పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే పాలక వర్గాలు కనీసం స్పందించడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో పని దినాలకు కోత విధించడమే కాకుండా రోజు వారీ వేతనం సైతం గిట్టుబాటు కాకుండా చేస్తుందన్నారు. ఎన్నికలకు ముందు ఆత్మీయ భరోసా కింద ఏడాదికి రూ. 12 వేలు జమ చేస్తామని చెప్పి ఇంత వరకు అమలు చేయలేదన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి త్వరలోనే ఆందోళన చేపడతామన్నారు. ఈ సమావేశంలో నాయకులు తాటి వెంకటేశ్వరరావు, కంపసాటి వెంకన్న, మేళ్లచెరువు వీరబాబు, పిట్టల రాంబాబు, సింగారపు సత్యనారాయణ, గోగుల ఆది, జిల్లా నాగరాజు, మందా ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

యూరియా అతిగా వాడితే అనర్థమే



అవగాహన కల్పిస్తున్న ఏఓ తారాదేవి


కామేపల్లి: సాగులో రైతులు అతిగా యూరియా వాడితే అనర్థమే అని ఏఓ భూక్యా తారాదేవి అన్నారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించడమే లక్ష్యంగా, నత్రజని సంబంధ ఎరువు యూరియా వాడకం తగ్గించే దిశగా పచ్చిరొట్ట సాగు, వాటిని కలియ దున్నడంపై కలిగే ప్రయోజనాలపై ఆదివారం క్షేత్ర స్థాయిలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మోతాదుకు మించి ఎక్కువగా యూరియాను వాడితే రైతులకు పంటల దిగుబడి పెరుగుతుందన్నది అపోహ మాత్రమే అన్నారు. ఈ కార్యక్రమంలో గాడిపల్లి శ్రీనివాసరావు, లకావత్ రాములు తదితరులు పాల్గొన్నారు.

పొంగిపొర్లుతున్న ఆకేరు చెక్‌డ్యామ్‌లు



బీసురాజుపల్లితండా వద్ద అలుగుపోస్తున్న చెక్‌డ్యామ్

తిరుమలాయపాలెం: భారీ వర్షాలతో ఆకేరు చెక్‌డ్యాంలు పొంగిపొర్లుతున్నాయి. వారం రోజులుగా మండలంలోని వర్షాలు కురుస్తుండటంతో ఆకేరుకు వరద తాకిడి రాలేదు. శనివారం రాత్రి నుండి మండలంలోని హైదర్‌సాయిపేట, రాకాసితండా, బీసురాజుపల్లితండా, రమణాతండా తదితర ప్రాంతాలలోని ఆకేరుపై నిర్మించిన చెక్‌డ్యామ్‌లలోకి భారీగా వరద పోటెత్తి పొంగి పొర్లుతున్నాయి. చెక్‌డ్యామ్‌లలోకి భారీగా వరద రావడంతో ఇసుక రవాణా నిలిచిపోయింది.



అజ్మీరతండా వద్ద